శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:51 సూర్యాస్తమయం - సా. 6:07 తిథిజి తదియ ఉ. 11:38 వరకు తరువాత చవితి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వాభాద్ర రా. 2:24ం వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం పరిఘ మ. 12:18 వరకు కరణం గరజి ఉ. 11:38 వరకు వనిజ రా. 10:26 వరకు వర్జ్యం ఉ. 10:11 నుండి ఉ. 11:40 వరకు దుర్ముహూర్తం ఉ. 8:21 నుండి ఉ. 9:06 వరకు రాహుకాలం ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు యమగండం మ. 1:54 నుండి మ. 3:18 వరకు గుళికాకాలం ఉ. 6:51 నుండి ఉ. 8:16 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:15 నుండి ఉ. 6:03 వరకు అమృత ఘడియలు రా. 7:06 నుండి రా. 8:35 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:52 వరకు

e-paper

# ఈ-కబురు


ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం


శనివారం | 1-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com

యాక్షన్ థ్రిల్లర్‌కి సై

వరలక్ష్మీ శరత్‌కుమార్

సినీ కబుర్లు









## గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రికి

# సీఎం రేవంత్ శంకుస్థాపన

### వరల్డ్ క్లాస్ వసతులతో కొత్త ఆసుపత్రి నిర్మాణం



- 26.30 ఎకరాల విస్తీర్ణంలో ఆసుపత్రి నిర్మాణ ప్రణాళిక
- భూమి పూజలో పాల్గొన్న మంత్రులు, కాంగ్రెస్ నేతలు
- 2 వేల పడకల సామర్థ్యంతో ఆసుపత్రి నిర్మాణం
- మల్టీ లెవల్ పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్ ప్రత్యేక ఆకర్షణ
- ఓపీ, ఐపీ సేవలతోపాటు ప్రత్యేక వైద్య యూనిట్లు
- అత్యాధునిక డయాగ్నొస్టిక్స్ సెంటర్ ఏర్పాటు
- ఏకకాలంలో 5000 మందికి సీటింగ్ సౌకర్యం
- మెడికల్ స్టూడెంట్స్ కోసం వసతి గృహాలు, హాస్టళ్లు
- రోగుల సహాయకులకు ఉచిత భోజనం కోసం ధర్మశాల
- తెలంగాణ వైద్యుల సంఘం హర్షం వ్యక్తం





నగరంలోని గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. వరల్డ్ క్లాస్ వసతులతో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం జరగనుంది. 26.30 ఎకరాల విస్తీర్ణంలో కొత్త ఆసుపత్రి నిర్మాణం ప్రభుత్వం చేపడుతోంది. భూమి పూజ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎస్ శాంత కుమారి సహా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఈ-కబురు, హైదరాబాద్**

జనవరి 31 : కొత్త ఉస్మానియా ఆసుప్రతిని పూర్తిగా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు వీలుగా డిజైన్లు సిద్ధం చేశారు. మొత్తం 2 వేల పడకలతో గోషామహల్ స్టేడియంలో ఆసుపత్రి ఏర్పాటు కానుంది. ఈ భవన నిర్మాణం పూర్తయితే ఇప్పటివరకు శిథిలావస్థకు చేరి తరచూ పెచ్చులూడుతున్న పురాతన భవనంలో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేందుకు అవకాశం ఏర్పడుతుంది.

#### మల్టీ లెవల్ పార్కింగ్

మొత్తం 26.30 ఎకరాలకు గాను 15.84 ఎకరాల్లో 'ఏ'బ్లాకును నిర్మించనున్నారు. అదే విధంగా 7.81 ఎకరాల్లో 'బీ'బ్లాకు ను నిర్మించనున్నారు. 0.74 ఎకరాల్లో 'సీ'బ్లాకు, 0.64 ఎకరాల్లో 'డీ'బ్లాక్, 0.22 ఎకరాల్లో 'ఈ'బ్లాకును నిర్మించేందుకు (మిగతా 2 వ పేజీలో)



### దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా

# బడ్జెట్ ఉంటుంది

### ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎంపీలంతా పార్లమెంట్‌కు చేరుకున్నారు. సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మీడియాతో మాట్లాడారు.

**ఈ-కబురు,ఢిల్లీ**

జనవరి 31 : పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని భావిస్తున్నట్లు చెప్పారు. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారని పార్లమెంట్‌లో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదలు, సామాన్యులపై మహాలక్ష్మి కృప ఎప్పటికీ ఉండాలని ఆకాంక్షించారు. (మిగతా 2 వ పేజీలో)






2

### కేసీఆర్ అసెంబ్లీకి వస్తే

# లెక్కలు చెబుతాం

### కేసీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ కౌంటర్


## బ్రిక్స్ దేశాలకు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



4

## యమునలో స్నానమెప్పుడు చేస్తారు ఢిల్లీ ఎదురుచూస్తోంది

కేజ్రీవాల్‌కు రాహుల్ ప్రశ్న



3

## ఆ రంగాన్ని సీఎం రేవంత్ చేజేతులా నాశనం చేస్తున్నాడు..

హరీష్ రావు కీలక వ్యాఖ్యలు



2



2

### టకీ టకీమని ఢిల్లీలో

## పైసలు పడుతున్నయ్..!

కాంగ్రెస్ రైతు భరోసాపై కేటీఆర్ సెటైర్లు..!

- బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణాల అభివృద్ధికి స్పెషల్ విజన్
- పదేళ్లలో తెలంగాణ పట్టణాలు మోడల్‌గా మారాయి
- పదవీ కాలం ముగిసినా ప్రజల్లోనే ఉండాలని సూచన

# నేను కొడితే మాములుగా ఉండదు

### జహీరాబాద్ నుంచి ఎర్రవల్లి వరకు బీఆర్ఎస్ కార్యకర్తల పాదయాత్ర



**ఈ-కబురు, హైదరాబాద్**

జనవరి 31 : సుదీర్ఘ కాలం తర్వాత మాజీ సీఎం కేసీఆర్ మౌనం వీడారు. 'నేను కొడితే మాములుగా ఉండదు' అంటూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో జహీరాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలతో కేసీఆర్ సమావేశం అయ్యారు. కేసీఆర్ మళ్ళీ సీఎం కావాలని (మిగతా 2 వ పేజీలో)

- మౌనం వీడి కేసీఆర్ కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగిన కేసీఆర్
- తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలనతో అసంతృప్తి
- ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవ్వాలని కేసీఆర్ పిలుపు
- ఫిబ్రవరిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు
- రైతుబంధు, దళితబంధుపై కేసీఆర్ స్పందన
- కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు పడిపోవడం
- ఓట్ల కోసం మత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్
- ఫామ్ హౌస్‌పై వస్తున్న విమర్శలకు కేసీఆర్ కౌంటర్
- కాంగ్రెస్‌కు కేసీఆర్ సంచలన వార్నింగ్



### ఎన్నికల కోడ్ సాకుతో రైతు భరోసా

# ఆపొద్దు

- ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ఆపొద్దు
- ఎన్నికల కోడ్ సాకుతో రైతుల పొట్ట కొట్టకండి
- అర్హులందరికీ రేషన్ కార్డులు అందాల్సిందే

2

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతాం

- "బలంగా కొట్టుడు కాదు, నిలబడమనండి" - రేవంత్
- ఫామ్ హౌస్‌లో కాకుండా అసెంబ్లీకి రమ్మని సవాల్
- మొగిలిగిద్ద పాఠశాల వార్షికోత్సవంలో సీఎం రేవంత్
- "కేసీఆర్ కోసం ఎవరు ఎదురు చూడడం లేదు" - రేవంత్ విమర్శ
- జహంగీర్ పీర్, రాజరాజేశ్వరస్వామికి నిధుల మోసం ఆరోపణ
- పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల తీర్పు స్పష్టమని వ్యాఖ్య
- "మాటలతో ఎగ్గొట్టను, అసెంబ్లీలో చర్చకు రా" - రేవంత్ సవాల్
- కేసీఆర్‌కు ప్రజల తిరస్కారం బుద్ధి తేలేదా?



**ఈ-కబురు, హైదరాబాద్**

జనవరి 31 : ఆయన కొడితే బలంగా కొడతా అంటున్నారు. బలంగా కొట్టుడు కాదు. సరిగ్గా నిలబడమనండి" అంటూ మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఫామ్ హౌస్‌లో కూర్చొని మాటలు చెప్పుడు కాదు. అసెంబ్లీకి రావాలంటూ సవాల్ విసిరారు. 150 ఏళ్లు పూర్తి చేసుకున్న రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ."కేసీఆర్ కోసం ఎవరు ఎదురు చూడడం లేదు. జహంగీర్ పీర్‌కి రూ.100 కోట్లు, రాజరాజేశ్వరస్వామికి రూ.100 కోట్లు ఇస్తామని మోసం చేశారు. పాలమూరును ఎండబెట్టిన ఘనులు మీరు. ఆయన కొడితే బలంగా కొడతా అంటున్నారు. బలంగా కొట్టుడు కాదు. సరిగ్గా నిలబడు. 14 నెలల ఫామ్ హౌస్‌లో పడుకుని గంభీరంగా చూస్తున్నాం అని అంటున్నావ్. ఏం చేస్తున్నావ్.హరీష్‌ను, కేటీఆర్‌ను ఊరిమీదకు వదిలావ్. నీను మీలాగా మాటలు చెప్పి ఎగ్గొట్టను. అబద్ధాలు చెప్పడం వల్లే ఓడిపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌కు గాడిగుడ్డు చేతికి ఇచ్చారు. అసెంబ్లీకి వస్తే ఏ ఊరికి ఎంత రుణ మాఫీ చేశామో చెబుతాం. నాకు, కేసీఆర్‌కు పోలింగ్ పెడితే కేసీఆర్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయంటా. సల్మాన్‌ఖాన్‌కు.. రాఖీ సావంత్‌కు ఓటింగ్ పెడితే .. రాఖీ సావంత్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయి. అంత మాత్రానా సల్మాన్ ఖాన్ హీరో కాకుండా పోరుగా. ప్రజలు తిరస్కరించినా బుద్ధిరాలేదు' అని రేవంత్ వ్యాఖ్యానించారు.



## గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రికి

# సీఎం రేవంత్ శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మిగిలిన స్థలంలో మిగతా బ్లాకులు నిర్మిస్తారు. ఇన్‌పేషంట్, అవుట్ పేషంట్ సర్వీసులతో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, పోస్టు ఆపరేటివ్ వార్డులు ఏర్పాటు చేయనున్నారు. దేశంలోనే అతిపెద్ద మల్టీ లెవల్ పార్కింగ్ సౌకర్యంతోపాటు లాండ్ స్కేపింగ్, గార్డెన్లతో ఆసుపత్రిలో ఆహ్లాదకర వాతావరణం నెలకొననుంది.

### సహాయకులకు ధర్మశాల ఉచిత భోజనం

ఓపీ, ఐపీ సేవలతో పాటు క్లిష్టమైన మూత్రపిండాలు, కాలేయం, స్కిన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లు కూడా ఏర్పాటు కానున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మార్చురీ, ఒకే గొడుగు కింద అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా అత్యాధునిక డయాగ్నొస్టిక్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఏకకాలంలో 3000-5000 మంది ఒకేచోట కూర్చొనే సామర్థ్యంతో కూడిన వెయిటింగ్ హాల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, దంత వైద్య కళాశాల కూడా ఇదే ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు.

### మెడికల్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక వసతి గృహం..

మెడికల్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక వసతి గృహంతో పాటు రోగుల సహాయకులకు ఉచిత భోజనం సరఫరా చేసే ధర్మశాల కూడా ఇక్కడ ఏర్పాటు కానుంది. ఫైర్ స్టేషన్, పోలీసు అవుట్ పోస్టు, ఫ్యాకల్టీ రెసిడెన్సీ సహా బోయ్స్, బాలికల హాస్టళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ కొత్త భవన నిర్మాణంతో రోగుల కష్టాలు పూర్తిగా తీరనున్నాయని తెలంగాణ వైద్యుల సంఘం ఉస్మానియా యూనిట్ ప్రకటించింది. ఈ మేరకు డాక్టర్ బొంగు రమేష్ నేతృత్వంలోని వైద్య బృందం గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపింది.



## ఎన్నికల కోడ్ సాకుతో

# రైతు భరోసా ఆపొద్దు

### బండి సంజయ్

**ఈ-కబురు, హైదరాబాద్**

జనవరి 31 : తెలంగాణలో ఎన్నికల కోడ్ సాకుతో రైతు భరోసా డబ్బులు నిలిపి వేయవద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఇది కొనసాగుతున్న పథకమే.. ఎన్నికల పేరుతో రైతుల పొట్టకొట్టకండి అని వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాల్సిందేనని చెప్పుకొచ్చారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ తాజాగా ఓ ప్రకటనలో.. 'రైతు భరోసా డబ్బులు వేయండి. ఇది కొనసాగుతున్న పథకమే. ఎన్నికల కోడ్ సాకుతో రైతుల పొట్టకొట్టకండి. ఎన్నికలు గ్రాడ్యుయేట్లు, టీచర్లకే పరిమితం. రైతు భరోసాతో ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశమే లేదు. ఇప్పటికే ఏడాది రైతు భరోసా సొమ్ము ఎగొట్టారు. అసలే అన్నదాతలు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేయాల్సిందే. రేషన్ కార్డులు అర్హులందరికీ ఇవ్వాల్సిందే.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా.. రైతు కూలీల అకౌంట్స్‌లో వేయాల్సిందే. ఎన్నికల కోడ్ సాకుతో ఆపితే ఊరుకునేది లేదు. ప్రభుత్వ చేతకానితనాన్ని ఎన్నికల కోడ్ పేరుతో ముడి పెట్టకండి. ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను కొనసాగించండి. అవసరమైతే బీజేపీ పక్షాన ఎన్నికల సంఘానికి లేఖ పంపిస్తాం. తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించండి. అవసరమైతే అందరం కలిసి ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేద్దాం' అని కామెంట్స్ చేశారు.

# టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నయ్..!

### కాంగ్రెస్ రైతు భరోసాపై కేటీఆర్ సెటైర్లు..!

**ఈ-కబురు, హైదరాబాద్**

జనవరి 31 : సమైక్య రాష్ట్రంలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా ఉండేవని.. బల్దియాలు అంటే ఖాయా.. పియా.. చల్దియా.. అనే సామెత ఉండేది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పని చేయాలని దిశా నిర్దేశం చేశారన్నారు. అందుకే ఆర్థిక ఇంజిన్లుగా ఉన్న పట్టణాలను, వాటిని సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. పట్టణీకరణ ఆపాలని కొన్ని దేశాలు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయన్నారు. పట్టాణాల విస్తరణ ఆపడం వీలు కాదు.. కానీ ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి మాత్రం అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆ దిశగా పదేళ్లు పనిచేశామన్నారు. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచామన్నారు.

### డైలాగులు కొడితే కాదు..

పదేళ్ల పాటు జరిగిన పట్టణాలు అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదన్నారు. పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ అవసరమైన నిధులు అందించడం తదితర నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు ఈ రోజు మోడల్ పట్టణాలుగా తయారయ్యాయన్నారు. తెలంగాణ పట్టణాలకు పదేళ్లలో అనేక జాతీయ అవార్డులు దక్కాయన్నారు. గత పది సంవత్సరాలుగా మున్సిపల్ చైర్‌పర్సన్లు కౌన్సిలర్లుగా పట్టణాల అభివృద్ధి కోసం పని చేశారన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పూర్తి చేశారని చెప్పారు. పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలని.. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున పరిపాలన వికేంద్రీకరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు.



### కొత్త జిల్లాలతో ప్రజల దగ్గరకు పాలన..

కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గరైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాలు అభివృద్ధి కుంటుపడడంతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తగా కట్టాల్సింది పోయి హైడ్రా, మూసి ప్రాజెక్టుల పేరుతో కూలగొడుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు సానుకూలంగా ఉంటే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేసిన మనల్ని కాంగ్రెస్ మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని.. కానీ అదే నల్లగొండ పట్టణంలో నాలుగు నెలలుగా సిబ్బందికి జీతాలు లేకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.


### మంత్రి సీనియర్ అయినా అభివృద్ధి పట్టించుకోలే..

నల్లగొండ పర్యటన తర్వాత నన్ను బచ్చగాడు అంటున్న మంత్రి.. సీనియర్ అయ్యుండి పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మోసపూరిత 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదన్నారు. టకీ టకీ మని పైసలు పడుతాయన్నారని.. కానీ, టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయన్నారు. ఆరున్నర లక్షల కొత్త రేషన్ కార్డులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇవ్వనేలేదంటూ అబద్ధాలు చెబుతుందన్నారు. ఈ విషయం అప్పటి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందన్నారు.

## దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా

# బడ్జెట్ ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)



భారత శక్తి సామర్థ్యాలు మనకు విశేష గుర్తింపునిస్తాయన్నారు. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్ ఉంటుందన్నారు.ఈ బడ్జెట్ వికసిత్ భారత్‌కు ఊతం ఇస్తుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో పనిచేయాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నట్లు చెప్పారు. కొత్త విధానాలపైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుందని మోదీ వివరించారు. ఈ సమావేశాల్లో కీలక బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరిగేలా సభ్యులు సహకరించాలని, బిల్లులకు విపక్షాలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.కాగా, జనవరి 31 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి.ఈ సమావేశాల్లో 16 బిల్లులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. వక్ఫ్(సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల(సవరణ) బిల్లు, రైల్వే(సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) బిల్లుతో పాటు వలస, విదేశీయుల బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది.ఈ నేపథ్యంలో గురువారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. పార్లమెంటరీ కమిటీల్లో మెజార్టీని ఉపయోగించి అజెండాను కేంద్రం బలవంతంగా రుద్దుతున్నదని విపక్షాలు ఆరోపించాయి.

# ఆ రంగాన్ని సీఎం రేవంత్ చేజేతులా నాశనం చేస్తున్నాడు..

### హరీష్ రావు కీలక వ్యాఖ్యలు

**ఈ-కబురు, హైదరాబాద్**

జనవరి 31 : కాంగ్రెస్ పాలనలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లతో పాటు ఇప్పుడు బిల్డర్లు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో కేసీఆర్‌తో కలిసి ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిర్మాణ రంగానికి స్వర్గధామంగా ఉన్న హైదరాబాద్‌లో ఫ్లాట్లు అమ్ముడు పోలేదని బిల్డర్ (మేడ్చల్ జిల్లాలో) ఉరేసుకునే పరిస్థితి రావడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు.. ఇప్పుడు బిల్డర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ఆత్మహత్యలన్నిటికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంగ్రెస్ నిర్లక్ష్య పాలన, అనాలోచిత అసమర్థ విధానాలే కారణమని మండిపడ్డారు.



శాంతి భద్రత దిగజారడం, పాలన పట్ల ప్రజల్లో నమ్మకం లేకపోవడం, అనుమతి ఉన్న ఇళ్లను సైతం హైడ్రా కూల్చివేయడం, మూసీ, ఫార్మా సిటీ, మెట్రో కారిడార్ల విషయంలో ద్వంద్వ ప్రకటనలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చేయకపోవడం, భవన నిర్మాణ అనుమతులకు బలవంతపు వసూళ్లు చేయడం, కొత్త పెట్టుబడులు రాకపోవడం, ఇతర రాజకీయ, ఆర్థిక పరిణామాలు రియల్ ఎస్టేట్ రంగంపై గడిచిన 14 నెలల కాంగ్రెస్ పాలనలో పెను ప్రభావాన్ని చూపాయని కీలక వ్యాఖ్యలు చేశారు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం అంటే బీఆర్ఎస్ హయాంలో బిల్డర్లకు స్వర్గధామంలా ఉండేదని.. ఇప్పుడు బిల్డర్లకు నరకకూపం అయ్యిందని అన్నారు. "నేను రియల్ ఎస్టేట్ రంగం నుంచి వచ్చాను. రియల్ ఎస్టేట్ గురించి నాకు చెప్తారా?" అని మీడియా సమావేశంలో దబాయించిన సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ రంగాన్ని చేజేతులా నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి ఇరుసుగా ఉన్న వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని ధ్వంసం చేశారు. హైదరాబాద్ గ్రోత్ ఇంజిన్ అయిన రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఇప్పటికైనా మేల్కోకపోతే పదేళ్లగా పురోభివృద్ధిలో ఉన్న తెలంగాణ, తిరోగమనం బాట పట్టే ప్రమాదం ఉందని తెలిపారు.

# నేను కొడితే మామూలుగా ఉండదు

(మొదటి పేజీ తరువాయి)



ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ నెల 27న జహీరాబాద్ నుంచి పాదయాత్రగా ఇవాళ ఎర్రవల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఇన్ని రోజులుగా నేను మౌనంగా ఉన్నా.. గంభీరంగా చూస్తున్నా. నేను కొడితే మామూలుగా ఉండదు. తెలంగాణ శక్తి ఏందో కాంగ్రెస్ వాళ్లకు చూపించి మెడలు వంచుతా. కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరు. కాంగ్రెస్ వాళ్లు దొరికితే ప్రజలు కొట్టేలా ఉన్నారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటేశారు. నిన్న కాంగ్రెస్ వాళ్లు ఓటింగ్ పెడితే మనకే ఎక్కువ ఓటింగ్ వచ్చింది. నేను చెప్పినా వినలేదు. అత్యాసకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారు. మన విజయం తెలంగాణ విజయం కావాలి. భూముల ధరలు అమాంతం పడిపోయాయి. ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కండి. ఫిబ్రవరి నెలాఖరును భారీ బహిరంగ సభ పెడుతున్నాం. మీరందరూ తప్పకుండా రావాలి. ఓట్ల కోట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుంది. సంగమేశ్వ, బసవేశ్వర టెండర్లను ఎందుకు పిలవలేదు. కాంగ్రెస్‌పై అంతటా అసంతృప్తే. అన్ని వర్గాలను కాంగ్రెస్ ముంచేసింది. పాలన వైఫల్యాలను ఎత్తి చూపితే కేసులు పెడుతున్నారు.రైతుబంధుకి రాంరాం, దళితబంధుకు జైభీం చెబుతారని ఆనాడే చెప్పా. అన్నీ మబ్బులు తొలగి పోయి అన్నీ బయటకు వస్తున్నాయి. మంచేదో చెడేదో ప్రజలకు తెలుస్తోంది. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటేశారు. రాబోయే రోజుల్లో విజయం మనదే. మనం విజయం తెలంగాణ విజయం కావాలి. కైలాసం ఆడితే పాము మింగినట్లుగా ఉంది పరిస్థితి. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నం చేస్తున్నారు. ఫామ్ హౌస్‌లో పంటలే ఉంటాయి కదా' అని వ్యాఖ్యానించారు.



## యమునలో స్నానమెప్పుడు చేస్తారు
# ఢిల్లీ ఎదురుచూస్తోంది
### కేజ్రీవాల్‌కు రాహుల్ ప్రశ్న

**ఈ-కబురు,న్యూఢిల్లీ**

జనవరి 31 : ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఢిల్లీ రాజకీయాలు యమునా నది కాలుష్యం చుట్టూ తిరుగుతున్నాయి. రాహుల్ గాంధీ గురువారం యమునా నదిలో విహరిస్తున్న వీడియోను విడుదల చేసి.. ఈ మురికి కాసారంలో ఎప్పుడు స్నానం చేస్తారని అరవింద్ కేజ్రీవాల్‌కు సవాల్ విసిరారు. యమునా కాలుష్యం ప్రధాని నరేంద్ర మోదీ, కేజ్రీవాల్‌ల నిర్లక్ష్యం, అవినీతి ఫలితమేనని రాహుల్ ఆరోపించారు. రాహుల్ బుధవారం యమునా నదిలో విహరించి.. నది దుస్థితిని వీడియో తీశారు. 'నాలాగా మీరు ఢిల్లీ వాసులైనట్లయితే యమునా నది పరిస్థితిని చూసి తీవ్రంగా విచారిస్తూ ఉంటారు. బుధవారం ఉదయం నేను యమునా నదికి వెళ్లాను. స్థానికులు, పడవలు నడిపేవాళ్లు, ఉద్యమకారులతో మాట్లాడాను. యమునా నదిలో ఎటు చూసినా చెత్తే. మురికినీళ్లే. దుర్వాసన వెదజల్లుతోంది. నీటి శుద్ధి తర్వాత వ్యర్థాలను తిరిగి యమునలోనే వదిలేస్తున్నారని పరిశోధకులు చెబుతున్నారు. యమునా నదిలో స్నానమాచరించడానికి గతంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చేవాళ్లు. ఇప్పుడు అతికొద్ది మంది మాత్రమే వస్తున్నారు. అదీ తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి'అని రాహుల్ అన్నారు.'ఢిల్లీలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యమునను శుద్ధి చేస్తామని కేజ్రీవాల్ శుష్క వాగ్దానాలు చేస్తున్నారు. నేను యమునా నదిలో మునక వేస్తాను లేదంటే మాకు ఓటు వేయకండి అంటూ సుదీర్ఘ ఉపన్యాసాలిస్తున్నారు.ఇప్పుడు యమునా నీటిని ఒక సీసాలో తీసుకొని ఆరోపణలు, ప్రత్యారోపణలకు దిగుతున్నారు.ఇది యమునా నదిని అవమానించడమే కాదు.. ఢిల్లీ ప్రజలను అపహాస్యం చేయడమే'అని రాహుల్ విమర్శించారు. 'కేజ్రీవాల్ జీ 2025 వచ్చింది. మీరెప్పుడు యమునా నదిలో మునక వేస్తారు.ఢిల్లీ ఎదురుచూస్తోంది'అని రాహుల్ ప్రశ్నించారు. యమున శుద్ధి పేరిట డబ్బులు మూటగట్టుకున్నారని ఆరోపించారు.



# ఆరేళ్ల తర్వాత తొలి బడ్జెట్

**ఈ-కబురు,జమ్ము**

జనవరి 31 : కొంగొత్త ఆశలతో ఆరేళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో తొలి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. కేబినెట్ ప్రతిపాదనకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం తెలపడంతో జమ్మూకశ్మీర్ ప్రభుత్వం మార్చి మొదటి వారంలో తొలి అసెంబ్లీ సమావేశాలకు సమయాత్తమవుతుంది. అసెంబ్లీ సమావేశాలు మార్చి 3నుండి ప్రారంభమై 21 రోజుల పాటు జరగనున్నాయి.

ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 2025-2026 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. జనవరి 21న ఒమర్ అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన జమ్మూకశ్మీర్ కేబినెట్ మార్చి మొదటి వారం నుంచి సెషన్‌ను నిర్వహించాలని ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనకు సిన్హా ఆమోదం తెలిపారని, మార్చి మొదటి వారంలో సెషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

లెఫ్టినెంట్ గవర్నర్ మార్చి 3 నుంచి తొలి రాష్ట బడ్జెట్ సమావేశాలు నిర్వహించేందుకు స్పీకర్ రహీమ్ రాథర్‌తో సంప్రదింపులు జరిపారు. ఇరువురి చర్చల అనంతరం అసెంబ్లీ కార్యదర్శి తెలియజేస్తారని, సమావేశాల ప్రారంభ తేదీ,వ్యవధిని చర్చిస్తారని సమాచారం. కాగా, జమ్మూ కశ్మీర్‌లో శాసనసభ లేకపోవడంతో మునుపటి ఐదు బడ్జెట్‌లను పార్లమెంటు ప్రవేశపెట్టింది. అయితే పీడీపీ-బీజేపీ ప్రభుత్వం పతనం తర్వాత అప్పటి గవర్నర్ సత్యపాల్ మాలిక్ నేతృత్వంలోని 2019-2020 బడ్జెట్‌ను ఆమోదించింది.



## హైదరాబాద్‌లో
# గులియన్ బారే సింద్రోమ్ కేసు

**ఈ-కబురు, హైదరాబాద్**

జనవరి 31 : నగరంలో గులియన్ బారే సింద్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. సిద్దిపేట మండలానికి చెందిన మహిళకు జీబీఎస్ ఉన్నట్లు వైద్యులు నిర్ధరించారు. బాధితురాలు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. ఇప్పటికే మహారాష్ట్రలో వంద వరకు ఈ కేసులు నమోదైన విషయం తెలిసిందే.గత కొన్ని రోజులుగా మహారాష్ట్రలో గులియన్ బారే సింద్రోమ్ కేసులు నమోదవడం ఆందోళనకు గురిచేస్తోంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితి ఇది.

# చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఆదుకోవాలి






### కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి
### నానక్ రాంగూడ చిరు వ్యాపారులతో కలిసి డిప్యూటీ కమిషనర్ తో సమావేశం

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

జనవరి 31 : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్ రాంగుడ చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఆదుకోవాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి కోరారు. నానక్ రాంగూడ చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపుపై స్పందించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి శుక్రవారం చిరువ్యాపారులతో కలిసి శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నానక్ రాంగుడలోని రోడ్డు ప్రక్కల ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించడంతో వ్యాపారులు రోడ్డున పడ్డారని అన్నారు. ఎన్నో కుటుంబాలు ఇక్కడ చిరు వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చిన్న వ్యాపారస్థులు పలు రకాల చిన్న చిన్న వ్యాపారాలను నడుపుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఎంతో కాలంగా వారు వారి వ్యాపారాలపై ఆధారపడి ఉన్నారని, అటువంటి వారికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. చిరు వ్యాపారుల జీవన భృతి కోల్పోకుండాషౌరికి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పూర్తిగా అండగా నిలవాలన్నారు. ఈ విషయమై డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి సానుకూలంగా స్పందించారని, చిరు వ్యాపారులను ఆదుకుంటామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.


ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, ఉపాధ్యక్షుడు తిరుపతి, సీనియర్ నాయకురాలు వరలక్ష్మి ధీరజ్, సీనియర్ నాయకులు సుమన్, శేఖర్, కిషన్ గౌలీ, గోపాల్, శంకర్, శ్రీను, నానక్ రాంగుడ వాసులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత, ఆస్తుల పరిరక్షణ లక్ష్యంగా
# పోలీస్ శాఖ సేవలు అందిస్తుంది
### డీసీపీ నర్సింహ
### సైబరాబాద్ పరిధిలో 5వ విడతలో 1190 సెల్ ఫోన్లు రికవరీ..

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

జనవరి 31 : ప్రజల భద్రత, ఆస్తుల పరిరక్షణ లక్ష్యంగా పోలీస్ శాఖ సేవలు అందిస్తుందని, అత్యుత్తమ పోలీస్ సేవలు అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని సైబరాబాద్ క్రైమ్ డీసీపీ నర్సింహ అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో దొంగతనానికి గురైన, పోగొట్టుకున్న 1190 సెల్ ఫోన్లను రికవరీ చేసి, 5వ విడతగా వాటి యజమానులకు అందజేశారు. శుక్రవారం గచ్చిబౌలి లోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రికవరీ చేసిన సెల్ ఫోన్లను యజమానులకు డీసీపీ అందజేశారు. వీటి విలువ 2.50 కోట్లు ఉంటుందని డీసీపీ తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ నర్సింహ మాట్లాడుతూ సెల్ ఫోన్ లు పరిమితమైన విధంగా వినియోగించేలా అవగాహన కలిగి ఉండాలన్నారు. దొంగిలించిన సెల్ ఫోన్లను 45 రోజుల వ్యవధిలో యూపీ, బీహార్, ఒరిస్సా, బెంగాల్ ప్రాంతాలకు వెళ్లి రికవరీ చేశామని తెలిపారు. పోలీస్ సేవలలో దేశంలో అత్యుత్తమ స్థానంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ప్రజల భద్రత, ఆస్తుల పరిరక్షణ లక్ష్యంగా పోలీస్ శాఖ సేవలు అందిస్తుందన్నారు. సెల్ ఫోన్ ను కమ్యూనికేషన్‌తో పాటు చాలా రకాల ఆర్థిక అవసరాలకు ఉపయోగిస్తునందున ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సెల్ ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే తప్పకుండా తిరిగి మీ ఫోన్ మీ చేతికి వస్తుందని హామీ ఇచ్చారు. సైబరాబాద్ పోలీసులు గత 6 నెలల కాలంలో ఐదు విడతలలో నాలుగు వేల ఫోన్ లను రికవరీ చేశామని పేర్కొన్నారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకొని తీసుకోవాలని ప్రజలకు సూచించారు. రానున్న రోజుల్లో సెల్ ఫోన్లు దొంగిలించాలంటే దొంగలే భయపడేలా పోలీసుశాఖ ఉక్కు పాదం మోపుతుందన్నారు. ఈ సమావేశంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.









# సరకొత్త డెస్టినీ 125ని లాంచ్ చేసిన హీరో మోటోకార్ప్
### అర్ సీ పురంలో ప్రారంభించిన శ్రీ వెంకన్న మోటార్స్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి

**ఈ-కబురు, పఠాన్ చెరు:**

జనవరి 31 : వరల్డ్ నంబర్ వన్ టూవీలర్ తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ సరికొత్త డెస్టినీ 125 వాహనాన్ని గురువారం రాత్రి లాంచ్ చేసింది. రామచంద్రాపురం పరిధిలోని భీరంగూడ శ్రీ వెంకన్న మోటార్స్ షోరూమ్‌లో డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి కొత్త డెస్టినీ వెహికిల్‌ను కస్టమర్ల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అర్బన్ మొబిలిటీ రంగంలో కొత్త డెస్టినీ 125 విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతోందని అన్నారు. ఇండస్ట్రీ ఫస్ట్ ఫీచర్లతో అత్యధిక మైలేజీ ఇచ్చే విధంగా డెస్టినీ మార్పు చేయబడిందని, అన్ని వర్గాల కుంటుంభాలకు సౌలభ్యంగా, మోడర్న్ రైడింగ్ ప్రియులకు అనుగుణంగా డెస్టిని సుస్థిరతను సంపాధించుకోనుందని పేర్కొన్నారు. బ్లూటూత్ కనెక్టివిటీ, డిజిటల్ స్పీడో మీటర్, టర్న్ బై టర్న్, నావిగేషన్, ఈకో ఇండికేటర్, రియల్ టైమ్ మైలేజ్ డిస్ప్లే, లో ఫ్యూయల్ సూచికలతో పాటు స్మార్ట్ ఫోన్ కనెక్టివిటీ, సులువుగా యాక్సెస్ చేసే విధంగా కాల్ రిజిస్టర్, ఇతర అలర్ట్స్ అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. కొత్త డెస్టినీ 125 వీఎక్స్, జెడ్ఎక్స్, జెడ్ఎక్స్ ప్లస్ మూడు వేరియంట్లలో అందుబాటులో ఉన్నాయని, వెంకన్న మోటార్స్ షోరూమ్‌లో కస్టమర్లు బుకింక్స్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ లాంచ్ కార్యక్రమంలో మేనేజర్ మహేందర్ రెడ్డి, సేల్స్ మేనేజర్ ధర్మతేజ, వెంకన్న మోటార్స్ సిబ్బంది పాల్గొన్నారు.




# Ai
## ఆర్థిక సర్వే హెచ్చరిక!

# ఏఐతో ముప్పు ఇదీ..

విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) సాంకేతికతతో ప్రయోజనాలు ఎంత ఉన్నా దాని విపరిణామాల పట్ల చాలా మందిలో ఆందోళన ఉంది. ఆరోగ్య సంరక్షణ, పరిశోధన నుండి ఆర్థికాంశాలు, విద్య వరకు ఆర్థికంగా విలువైన చాలా పనులను ఆటోమేట్ చేయడం ద్వారా పరిశ్రమలలో విప్లవాత్మక మార్పులు తెస్తామని ఏఐ డెవలపర్‌లు హామీ ఇస్తున్నప్పటికీ, ఈ పురోగతి గణనీయమైన విపరిణామాలనూ తీసుకుతో రావచ్చని ఆర్థిక సర్వే 2024-2025 హెచ్చరిస్తోంది.

ఆర్థిక సర్వే 2024-2025ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా పార్లమెంట్ ముందు సమర్పించారు. ఏఐ పురోగతి ముఖ్యంగా మధ్య, దిగువ ఆదాయ కార్మికులపై ప్రభావాన్ని చూపుతుందని, వివిధ రంగాలలో మానవ నిర్ణయాధికారాన్ని ఏఐ అధిగమించడం వలన పెద్ద ఎత్తున ఉపాధిలో మార్పులు సంభవిస్తాయని ఆర్థిక సర్వే అంచనా వేస్తోంది.

### ఏమిటీ ఎకనామిక్ సర్వే?

ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా అనేది గత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థలో జరిగిన పరిణామాలను సమీక్షించే ప్రీ-బడ్జెట్ డాక్యుమెంట్. ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలపై పనితీరు, విధానపరంగా సానుకూల మార్పులను సంగ్రహించి విశదీకరిస్తుంది. అలాగే స్వల్ప, మధ్య కాలానికి ఆర్థిక వ్యవస్థకు ఉన్న అవకాశాలను తెలియజేస్తుంది. సాధారణంగా బడ్జెట్ ప్రవేశపెట్టే ముందుగా దీన్ని వెల్లడిస్తారు.

### ఏఐపై ఆర్థిక సర్వే 2024-25 ఏం చెప్పిందంటే..

- ఆరోగ్య సంరక్షణ, పరిశోధన, నేర న్యాయం, విద్య, వ్యాపారం, ఆర్థిక సేవలతో సహా వివిధ రంగాలలో క్లిష్టమైన నిర్ణయం తీసుకోవడంలో ఏఐ మానవ పనితీరును అధిగమించగలదని అంచనా ఉంది. ఇది పెద్ద ఎత్తున మధ్య, దిగువ ఆదాయ కార్మికుల ఉపాధిని ప్రభావితం చేస్తుంది.
- మునుపటి పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలతో పోలిస్తే ప్రస్తుత ఏఐ స్వీకరణ ప్రతికూల ప్రభావాల భయాలు అంతగా కనిపించకపోవచ్చు.
- భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా సేవా ఆధారితమైన నేపథ్యంలో చిన్న స్థాయి ఐటీ సేవల్లో పనిచేసే ఉద్యోగులకు ఆటోమేషన్ ముప్పు ఉంటుంది. ఎందుకంటే కంపెనీలు ఖర్చులను తగ్గించడానికి కార్మికులను తొలగించి సాంకేతికతతో భర్తీ చేస్తాయి.
- ప్రతికూల ప్రభావాలను తగ్గించడానికి సామూహిక సామాజిక ప్రయత్నం అవసరం. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, విద్యాసంస్థల మధ్య సహకారం ద్వారా భారతదేశం బలమైన సంస్థల సృష్టిని వేగవంతం చేయాలి.
- నైపుణ్య సంస్థలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి ఉద్యోగులను ఏఐతో కలిసి పనిచేసేలా సన్నద్ధం చేయాలి.
- ఏఐ ప్రస్తుతం శైశవదశలో ఉన్నందున దాని పునాదులను బలోపేతం చేయడానికి, దేశవ్యాప్త సంస్థాగత ప్రతిస్పందనను సమీకరించడానికి అవసరమైన సమయం దేశానికి లభించింది.
- విస్తృత-వ్యాప్తి స్వీకరణను సాధించడానికి ముందు ఏఐ డెవలపర్‌లు అధిగమించాల్సిన కొన్ని సవాళ్లు ఉన్నాయి. ప్రాక్టికాలిటీ, విశ్వసనీయత అనేది డెవలపర్లు పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలు.
- యువ, డైనమిక్, సాంకేతిక-అవగాహన ఉన్న జనాభాను పెంచడం ద్వారా పని, ఉత్పాదకతను పెంపొందించడానికి ఏఐని ఉపయోగించగల శ్రామిక శక్తిని సృష్టించగల సామర్థ్యాన్ని భారతదేశం కలిగి ఉంది.
- కార్మిక శక్తి, సాంకేతికత సరైన మార్గంలో సమతుల్యం అయినప్పుడు, ఒకదానికొకటి సమాంతరంగా ఉంటాయి. పని భవిష్యత్తు శ్రామిక శక్తి, యంత్ర సామర్థ్యాలను ఏకీకృతం చేసే 'అగ్మెంటెడ్ ఇంటెలిజెన్స్' చుట్టూ తిరుగుతుంది.

లేబర్ మార్కెట్‌లో ఏఐతో వచ్చే మార్పులు శాశ్వత ప్రభావాలను కలిగి ఉండే అవకాశం ఉన్నందున విధాన నిర్ణేతలు ఆవిష్కరణలను సామాజిక వ్యయాలతో సమతుల్యం చేయాలి.



# ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య బీమా

ఆయుష్మాన్ భారత్ పథకం కింద డెబ్బై ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య బీమా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల వృద్ధులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. సమ్మిళిత వృద్ధి, సామాజిక సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు.


ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) అని కూడా పిలుస్తారు. ఇది ప్రపంచంలోని అతిపెద్ద ప్రభుత్వ నిధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో ఒకటి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఆరోగ్య కవరేజీని అందించడం, ఆర్థిక ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉండేలా చూడటం దీని లక్ష్యం. ఈ పథకంలో సీనియర్ సిటిజన్లను చేర్చడం వల్ల వృద్ధుల ఆరోగ్య అవసరాలను తీర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య బీమాను వర్తింపజేయాలన్న నిర్ణయం వారి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు భావిస్తున్నారు. పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ వ్యయంతో చాలా మంది వృద్ధులు వైద్య సేవలను పొందడంలో ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో వృద్ధులైన లబ్ధిదారుల సంఖ్యను ఆరు కోట్లకు చేర్చాలనే నిర్ణయం వారికి ఆర్థిక ఉపశమనాన్ని అందిస్తుందని చెబుతున్నారు. వారికి సకాలంలో, తగిన వైద్య సంరక్షణ లభించేలా చేస్తుందని అంటున్నారు.

ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వ నిబద్ధత

దేశవ్యాప్తంగా ఆరోగ్య మౌలిక సదుపాయాలు, సేవలను మెరుగుపరచడానికి ప్రభుత్వం అంకితభావంతో ఉందని ముర్ము నొక్కి చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో సీనియర్ సిటిజన్లను చేర్చడం మొత్తం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మెరుగుపరచడంలో విస్తృత వ్యూహంలో భాగంగా పరిగణించవచ్చు. ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలను బలోపేతం చేయడం, అవసరమైన మందుల లభ్యతను పెంచడం, నివారణ ఆరోగ్య సంరక్షణ చర్యలను ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముర్ము అన్నారు.

# బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక: ఆ ప్రయత్నం చేస్తే..



డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత బ్రిక్స్ దేశాలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా డాలర్ విలువను తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తే.. కఠిన చర్యలు తప్పవని, బ్రిక్స్ కూటమిలోని దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తానని స్పష్టం చేశారు. ఇతర దేశాలు కొత్త బ్రిక్స్ కరెన్సీని సృష్టించలేవు.. శక్తివంతమైన యూఎస్ డాలర్‌ను భర్తీ చేయడం సాధ్యం కాదు. ఇలాంటి ప్రయత్నాలు జరిగితే.. 100 శాతం టారిఫ్‌లు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు. ప్రపంచ వాణిజ్యంలో యూఎస్ డాలర్ వాడకాన్ని తగ్గించడానికి ప్రయత్నించే ఏ దేశంపైనైనా వంద శాతం సుంకాలు విధించడానికి వెనుకాడమని అన్నారు.

బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లతో కూడిన ఇంటర్‌గవర్నమెంటల్ ఆర్గనైజేషన్ బ్రిక్స్.. అంతర్జాతీయ వాణిజ్యం కోసం యూఎస్ డాలర్‌కు ప్రత్యామ్నాయాలపై చర్చిస్తోంది. అయితే సుంకాలను ఆహ్వానించాలని అనుకుంటే.. అమెరికాకు వీడ్కోలు చెప్పవచ్చు అని ట్రంప్ అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా.. అమెరికా డాలర్ నుండి వైదొలగాలనే ఆలోచన లేదు. బ్రిక్స్ కరెన్సీ కోసం ప్రస్తుత ప్రతిపాదనలేవీ కూడా లేవని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. యూఎస్ డాలర్ ప్రపంచ వాణిజ్యంపై ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇది ప్రపంచంలో 90 శాతం కంటే ఎక్కువ లావాదేవీలను కలిగి ఉంది. యూఎస్ డాలర్ తరువాత జపనీస్ యెన్, యూరో, బ్రిటిష్ పౌండ్ వంటి ఇతర కన్వర్టిబుల్ కరెన్సీలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. కాగా వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి.. ఒకే కరెన్సీపై ఆధారపడటాన్ని తగ్గించడానికి బ్రిక్స్ కరెన్సీ ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది కొన్ని దేశాలు అభిప్రాయ పడుతున్నట్లు సమాచారం.

# జపాన్‌కు మేడ్ ఇన్ ఇండియా కారు

భారతదేశంలో తయారవుతున్న వాహనాలకు.. విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇప్పటికే పలు వాహనాలు మన దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు తాజాగా 'మారుతి సుజుకి'కంపెనీకి చెందిన 'జిమ్నీ' జపాన్‌కు చేరింది. దీన్నిబట్టి చూస్తే.. ఈ కారుకు జపాన్‌లో కూడా అభిమానులు ఉన్నట్లు తెలుస్తోంది. 2023లో జరిగిన ఆటో ఎక్స్‌పోలో కనిపించిన మారుతి జిమ్నీ.. ప్రస్తుతం 5 డోర్ వెర్షన్ రూపంలో కూడా అమ్మకానికి ఉంది. ఇదే ఇప్పుడు జపాన్‌లో విక్రయానికి సిద్ధమైంది. అంతే కాకుండా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మారుతి సుజుకి అత్యధికంగా ఎగుమతి చేసిన వాహనాల్లో ఇది రెండో మోడల్ అని తెలుస్తోంది. జిమ్నీ 5 డోర్ కారు హర్యానాలోని గురుగ్రామ్‌లో.. మారుతి సుజుకి తయారీ కేంద్రంలో ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఇది గ్లోబల్ ఆఫ్ రోడర్‌గా ప్రసిద్ధి చెందింది. ఇప్పటికే ఈ కారును కంపెనీ దాదాపు 100 దేశాలకు ఎగుమతి చేస్తోంది. ఇప్పుడు జపాన్‌కు కూడా తరలించింది. మొత్తం మీద కంపెనీ ఇప్పటి వరకు 3.5 లక్షల కంటే ఎక్కువ జిమ్నీ కార్లు గ్లోబల్ మార్కెట్లో అమ్ముడయ్యాయి. జిమ్నీ 5 డోర్ మోడల్ జపాన్‌లో ప్రారంభమైన సందర్భంగా మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ %డ% సీఈఓ హిసాషి టకేయుచి మాట్లాడుతూ.. జపాన్‌లో 'మేడ్ ఇన్ ఇండియా' జిమ్నీ 5-డోర్‌ను ప్రవేశపెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఆగష్టు 2004లో కంపెనీ అత్యధికంగా ఎగుమతిచేసిన కార్లలో 'ఫ్రాంక్స్' తరువాత.. జిమ్నీ ఉంది. మెక్సికో, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి మార్కెట్లలో అమ్మకాల పరంగా ఇది గొప్ప విజయం సాధించిందని అన్నారు.



# వీల్‌చైర్‌లో ప్రమోషన్స్‌కు రష్మిక..

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నాచేతిలో అరడజను సినిమాలున్నాయి. క్షణం తీరిక లేకుండా పరుగులు తీస్తున్న రష్మికకు ఇటీవల సడన్ బ్రేక్ పడింది. జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో గాయపడింది. ఇంకా ఆ గాయం నుంచి ఆమె కోలుకోలేకపోతోంది. ఓ పక్క గాయం తనను ఇబ్బందిపెడుతున్నా సరే పనికి మాత్రం విశ్రాంతి ఇవ్వనంటోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ హైదరాబాద్‌లో జరిగిన ఛావాఈవెంట్‌కు హాజరైంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమెను బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్ వీల్‌చైర్‌లో స్టేజిపైకి తీసుకొచ్చాడు. అనంతరం రష్మిక.. అతడికి మంగళహారతిచ్చింది. అంతేకాదు.. విక్కీ కౌశల్ కు కొంత తెలుగు కూడా నేర్పించింది.



ఆమె సహకారంతో అతడు.. అందరికీ నమస్కారం. అందరూ బాగున్నారా? హైదరాబాద్‌కు రావడం చాలా సంతోషంగా ఉంది అని తెలుగులో మాట్లాడాడు. అటు రష్మిక డెడికేషన్‌ను, ఇటు విక్కీ కౌశల్ మంచిగుణాన్ని అభిమానులు పొగడకుండా ఉండలేకపోతున్నారు. బిజీగా ఉన్నా, డేట్స్ కుదర్లేదంటూ ప్రమోషన్స్‌కు దుమ్మా కొట్టేవాళ్లే చాలామంది.. కానీ రష్మిక గాయంతో బాధపడుతున్నా సరే ఈవెంట్‌కు రావడం గొప్ప విషయం అని ప్రశంసిస్తున్నారు.

'చూసీ చూడంగానే నచ్చేశావే..' అని రష్మికాను ఉద్దేశించి పాట పాడుకున్నారు యువతరం ప్రేక్షకులు. అందం, అభినయంతో అంతలా ఆకట్టుకుందామె. కన్నడలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ 'ఛలో ' సినిమాతో తెలుగుకి పరిచయమైంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా పేరు సంపాదించుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో అరడజను సినిమాలున్నాయి.

వాటిలో 'రెయిన్ బో, ది గాళ్ ఫ్రెండ్' వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిలింస్ కూడా ఉన్నాయి. శాంతరూబన్ దర్శకునిగా పరిచయమవుతున్న 'రెయిన్ బో' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోంది. ది గాళ్ ఫ్రెండ్ విషయానికి వస్తే.. 'చిలసౌ' సినిమాతో దర్శకుడిగా మారిన నటుడు రాహుల్ రవీంద్రన్ ఈ మూవీకి డైరెక్షన్ చేయనున్నాడు.

సల్మాన్ ఖాన్ హీరోగా మురుగదాస్ తెరకెక్కిస్తున్న హిందీ మూవీ 'సికందర్'లోనూ రష్మిక కథానాయిక. నాగార్జున, ధనుశ్ హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న తెలుగు, తమిళ చిత్రం 'కుబేర'లోనూ తనే హీరోయిన్. అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్న 'థామా' అనే బాలీవుడ్ మూవీలోనూ రష్మిక భాగమైంది.

అలాగే విక్కీ కౌశల్ హీరోగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన బాలీవుడ్ మూవీ 'ఛావా'లో ఈ బ్యూటీ హీరోయిన్‌గా చేసింది. ఛత్రపతి శివాజీ తనయుడు సాంబాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. సాంబాజీని చావా (మరాఠీలో పులి బిడ్డ అని అర్థం) అని పిలుస్తారు. చావా మొదటి భార్య యేసుబాయ్‌గా రష్మిక నటిస్తోంది. ఈ సినిమా ఫిబ్రవరి 14న విడుదల కానుంది.



# ప్రభాస్ 'స్పిరిట్' ఆరంభం ఎప్పుడంటే..?

'స్పిరిట్' సినిమా సెట్స్‌కు వెళ్లే సమయం ఆసన్నమైంది. ప్రభాస్ హీరోగా 'అర్జున్ రెడ్డి, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగాదర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను మేలో ప్రారంభించాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారిగా పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించనున్నారు. దీంతో లుక్స్, ఫిజిక్ పరంగా స్పెషల్‌గా మేకోవర్ కానున్నారట. 'స్పిరిట్' చిత్రీకరణ అనుకున్న సమయానికన్నా కాస్త ఆలస్యం కావడానికి ఇదొక కారణమని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, ఆలియా భట్, రష్మికా మందన్నా... ఇలా పలువురు తారల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ ఇంకా ఎవరూ ఫైనలేజ్ కాలేదట. టీ సిరీస్ భూషణ్ కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా (సందీప్‌రెడ్డి వంగా సోదరుడు) భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్న 'స్పిరిట్' చిత్రం 2026 చివర్లో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్.

# వారం రోజుల్లోనే ఓటీటీకి త్రిష మూవీ..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష ప్రస్తుతం కోలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంది. ఒకప్పుడు తెలుగులో స్టార్ హీరోయిన్‌గా ఉన్న ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్‌లో పెద్దగా కనిపించట్లేదు. గతేడాది విజయ్ సరసన ది గోట్ చిత్రంలో కనిపించిన త్రిష.. ప్రస్తుతం అజిత్ కుమార్ మూవీ విదాముయార్చితో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంక్రాంతికే విడుదల కావాల్సిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.

ఇదిలా ఉండగా.. త్రిష మలయాళంలో వరుస సినిమాలు చేస్తోంది. మాలీవుడ్‌లో ఐడెంటిటీ అనే మూవీలో నటించింది. క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రంలో టొవినో థామస్ హీరోగా నటించారు. సంక్రాంతికి కానుకగా మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. ఈ సినిమాకు అనాస్ ఖాన్ దర్శకత్వం వహించారు. మలయాళంలో హిట్ టాక్ రావడంతో తెలుగులోనూ ఈ చిత్రాన్ని విడుదల చేశారు. జనవరి 24న తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా రిలీజైంది. ఈ మూవీకి టాలీవుడ్ ఆడియన్స్ నుంచి కూడా అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. అయితే కలెక్షన్ల పరంగా పెద్దగా రాణించలేకపోయింది. రూ. 12 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఐడెంటిటీ సినిమాకు బాక్సాఫీస్ వద్ద వరల్డ్ వైడ్‌గా రూ. 18 కోట్ల కలెక్షన్స్ మాత్రమే రాబట్టింది. గత శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం సడన్‌గా ఓటీటీకి వచ్చేసింది. కేవలం వారం రోజుల్లోనే ఓటీటీలో సందడి చేస్తోంది.

# ఓటీటీకి వందకోట్ల సినిమా..

గతేడాది రిలీజైన మోస్ట్ వయలెంట్ చిత్రం మార్కో. ఉన్ని ముకుందన్ హీరోగా నటించిన ఈ చిత్రం మలయాళంలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కేవలం రూ. 30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం.. మలయాళంలోనే రూ.100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. దీంతో బాక్సాఫీస్ వద్ద పలు రికార్డులు సృష్టించింది. అంతేకాకుండా మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఈ సినిమా అంచనాలకు మించి వసూళ్లు రాబట్టింది. దీంతో ఈ చిత్రం ఓటీటీ విడుదల కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్‌ను మేకర్స్ రివీల్ చేశారు. వచ్చేనెల 14న లవర్స్ డే సందర్భంగా స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ విషయాన్ని మార్కో ఓటీటీ రైట్స్ దక్కించుకున్న సోనీ లివ్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.జార్జ్ (సిద్దిఖీ) గోల్డ్ బిజినెస్ చేస్తుంటాడు. ఈ వ్యాపారంలో తనకు మించినవాళ్లు ఉండరు. సిండికేట్ ఏర్పాటు చేసి.. దాని లీడర్‌గా వ్యవహరిస్తుంటారు.




# అదే మమ్మల్ని ఒక్కటి చేసింది..



లవ్‌స్టోరీ సినిమా తర్వాత నాగచైతన్య , సాయిపల్లవి మరోసారి జత కట్టిన మూవీ తండేల్ . కార్తికేయ 2 ఫేం చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. దాదాపు రూ.80 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీపై నిర్మాత అల్లు అరవింద్ ధీమాగా ఉన్నాడు. ఇటీవల ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నాగచైతన్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైజాగ్ తనకు స్పెషల్ అని.. అక్కడ సినిమా ఆడిందంటే ప్రపంచంలో ఎక్కడైనా ఆడాల్సిందే అన్నాడు. వైజాగ్ తనకు ఎంత క్లోజ్ అంటే వైజాగ్ అమ్మాయి (శోభిత)ని ప్రేమించి, పెళ్లి చేసుకున్నానని.. ఇప్పుడు తన ఇంట్లో రూలింగ్ పార్టీ వైజాగే ఉందన్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో చై.. వైజాగ్ రూలింగ్ పార్టీ గురించి మాట్లాడాడు. వైవాహిక జీవితం చాలా బాగుంది. ప్రస్తుతం లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నాను. మా పెళ్లయి కొన్ని నెలలే అవుతోంది. ఈ సమయంలో ఇద్దరం ఓపక్క సినిమాలు చేస్తూనే మరోపక్క మాకంటూ ప్రత్యేక సమయం కేటాయించుకుంటున్నాం. వర్క్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకుంటున్నాం. మా ఇద్దరికీ ఉన్న సేమ్ లక్షణాల్లో ఇదీ ఒకటి. అలాగే సినిమాపై మాకున్న ప్రేమ మాటల్లో చెప్పలేనిది. జీవితంపైనా మాకు ఎంతో ఆసక్తి ఉంది. అదే మమ్మల్ని ఒకటిగా ముందుకు నడిపించింది. మాకు ట్రావెలింగ్ అంటే కూడా ఇష్టం. భవిష్యత్తులో శోభిత, నేను ఒకే సినిమాలో కలిసి నటిస్తామా? లేదా? అన్నది నేనిప్పుడే చెప్పలేను. మంచి స్క్రిప్ట్ మమ్మల్ని వెతుక్కుంటూ వస్తే మాత్రం తప్పకుండా చేస్తాం.



# యాక్షన్ థ్రిల్లర్ కి సై

నెగటివ్ రోల్స్‌తో దూసుకెళుతూ, పాజిటివ్ క్యారెక్టర్స్‌లోనూ భేష్ అనిపించుకున్నారు వరలక్ష్మీ శరత్‌కుమార్ . కథ నచ్చినప్పుడుల్లా కథానాయికప్రాధాన్యం ఉన్న చిత్రాలు కూడా చేస్తుంటారామె. తాజాగా ఆ తరహా చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారామె. ఈ సినిమాకి 'ఆదిపర్వం' మూవీ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించనున్నారు. "సంజీవ్ మేగోటి రాసుకున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ కథకి వరలక్ష్మి ఓకే చెప్పారు. ఈ మూవీలో ఆమె మెయిన్ లీడ్ చేయనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్న ఈ సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులను తీసుకోనున్నాం. పూర్తి వివరాలు అతి త్వరలోనే ప్రకటిస్తాం" అని మేకర్స్ తెలిపారు.



# విరాట్ కోహ్లిని అధిగమించిన హార్దిక్ పాండ్యా

**ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగో టీ20లో టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అరుదైన రికార్డు సాధించాడు. ఈ మ్యాచ్‌లో మెరుపు హాఫ్ సెంచరీ (30 బంతుల్లో 53బీ 4 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి టీమిండియా గౌరవప్రదమైన స్కోర్ చేసేందుకు దోహదపడిన పాండ్యా.. భారత్ తరఫున డెత్ ఓవర్లలో (16 నుంచి 20) అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా అవతరించాడు. పాండ్యా ఈ రికార్డును సాధించే క్రమంలో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిని అధిగమించాడు. విరాట్ డెత్ ఓవర్లలో 192.54 స్ట్రయిక్‌రేట్‌తో 1032 పరుగులు చేయగా.. పాండ్యా 174.24 స్ట్రయిక్‌రేట్‌తో 1068 పరుగులు చేశాడు.**

మ్యాచ్ విషయానికొస్తే.. నాలుగో టీ20లో హార్దిక్ పాండ్యా శివాలెత్తిపోయాడు. చాలాకాలం తర్వాత అతని బ్యాట్ నుంచి విధ్వంసకర ఇన్నింగ్స్ జాలు వారింది. ఈ మ్యాచ్‌లో తొలి 14 పరుగులు చేసేందుకు 17 బంతులు తీసుకున్న హార్దిక్.. ఆతర్వాత చేసిన 39 పరుగులను కేవలం 13 బంతుల్లో రాబట్టాడు. 15 ఓవర్లు ముగిసే సమయానికి హార్దిక్ స్కోర్ 17 బంతుల్లో 14 పరుగులు కాగా.. 18 ఓవర్ ముగిసే సరికి అతని స్కోర్ 30 బంతుల్లో 53 పరుగులుగా ఉండింది. 15-18 ఓవర్ల మధ్యలో హార్దిక్.. శివమ్ దూబేతో కలిసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ కేవలం 27 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. హార్దిక్, శివమ్ దూబే విరుచుకుపడటంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 181 పరుగుల భారీ స్కోర్ చేసింది. 12 పరుగుల వద్ద ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉండిన భారత్‌ను హార్దిక్ పాండ్యా , శివమ్ దూబే (34 బంతుల్లో 53బీ 7 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆదుకున్నారు.

వీరికి ముందు అభిషేక్ శర్మ (19 బంతుల్లో 29బీ 4 ఫోర్లు, సిక్స్), రింకూ సింగ్ (26 బంతుల్లో 30బీ 4 ఫోర్లు, సిక్స్) ఓ మోస్తరు ఇన్నింగ్స్‌లు ఆడారు. 19 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసిన భారత్.. చివరి ఓవర్‌లో కేవలం 3 పరుగులు మాత్రమే చేసి మూడు వికెట్లు కోల్పోయింది.

చివరి ఓవర్‌ను జేమీ ఓవర్టన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. భారత ఆటగాళ్లలో సంజూ శాంసన్ (1), తిలక్ వర్మ (0), సూర్యకుమార్ యాదవ్ (0) దారుణంగా విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో సాకిబ్ మహమూద్ 3, జేమీ ఓవర్టన్ 2, బ్రైడన్ కార్స్, ఆదిల్ రషీద్ తలో వికెట్ పడగొట్టారు.


182 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ తొలి 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. ఫిలిప్ సాల్ట్ 23, బెన్ డకెట్ 39, జోస్ బట్లర్ 2 పరుగులు చేసి ఔట్ కాగా.. హ్యారీ బ్రూక్ (12), లివింగ్‌స్టోన్ (8) క్రీజ్‌లో ఉన్నారు. భారత బౌలర్లలో బిష్ణోయ్ 2, అక్షర్ పటేల్ ఓ వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలవాలంటే 60 బంతుల్లో 96 పరుగులు చేయాలి. కాగా, 5 మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.

## నాలుగో టీ20లో ఇంగ్లండ్‌పై భారత్ గెలుపు..

# సిరీస్ కైవసం

**ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే ం 3-1 తేడాతో కైవసం చేసుకుంది. ఇవాళ (జనవరి 31) జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ 15 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. హార్దిక్ పాండ్యా (30 బంతుల్లో 53బీ 4 ఫోర్లు, 4 సిక్సర్లు), శివమ్ దూబే (34 బంతుల్లో 53బీ 7 ఫోర్లు, 2 సిక్సర్లు) విరుచుకుపడటంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 181 పరుగుల భారీ స్కోర్ చేసింది.**

భారత ఇన్నింగ్స్‌లో హార్దిక్, దూబేతో పాటు అభిషేక్ శర్మ (19 బంతుల్లో 29బీ 4 ఫోర్లు, సిక్స్), రింకూ సింగ్ (26 బంతుల్లో 30బీ 4 ఫోర్లు, సిక్స్) రాణించగా.. సంజూ శాంసన్ (1), తిలక్ వర్మ (0), సూర్యకుమార్ యాదవ్ (0) దారుణంగా విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో సాకిబ్ మహమూద్ 3, జేమీ ఓవర్టన్ 2, బ్రైడన్ కార్స్, ఆదిల్ రషీద్ తలో వికెట్ పడగొట్టారు.




182 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 19.4 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో హ్యారీ బ్రూక్ (51) అర్ద సెంచరీతో రాణించగా.. ఓపెనర్లు బెన్ డకెట్ (39), ఫిలిప్ సాల్ట్ (23) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఆఖర్లో జేమీ ఓవర్టన్ (19) వేగంగా పరుగులు రాబట్టినప్పటికీ అప్పటికే ఇంగ్లండ్ ఓటమి ఖరారైపోయింది. ఇంగ్లండ్ ఆటగాళ్లు జోస్ బట్లర్ (2), లివింగ్‌స్టోన్ (9), జేకబ్ బేతెల్ 96), బ్రైడన్ కార్స్ (0), జోఫ్రా ఆర్చర్ (0) నిరాశపరిచారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా (గాయపడిన శివమ్ దూబే స్థానంలో కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చాడు), రవి బిష్ణోయ్ తలో మూడు వికెట్లు పడగొట్టగా.. వరుణ్ చక్రవర్తి 2, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

ఏడో వికెట్ కోల్పోయిన ఇంగ్లండ్

137 పరుగుల వద్ద ఇంగ్లండ్ ఏడో వికెట్ కోల్పోయింది. హర్షిత్ రాణా బౌలింగ్‌లో జేకబ్ బేతెల్ (6) ఔటయ్యాడు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలవాలంటే 24 బంతుల్లో 45 పరుగులు చేయాలి.

ఐదో వికెట్ కోల్పోయిన ఇంగ్లండ్

129 పరుగుల వద్ద ఇంగ్లండ్ ఐదో వికెట్ కోల్పోయింది. 25 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసి ప్రమాదకరంగా కనిపించిన హ్యారీ బ్రూక్.. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో ఔటయ్యాడు.

నాలుగో వికెట్ కోల్పోయిన ఇంగ్లండ్

గాయపడిన శివమ్ దూబే స్థానంలో కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన హర్షిత్ రాణా డేంజరెస్ ఆటగాడు లియామ్ లివింగ్‌స్టోన్ (9) వికెట్ పడగొట్టాడు. 12 ఓవర్ల తర్వాత ఇంగ్లండ్ స్కోర్ 99/4గా ఉంది. హ్యారీ బ్రూక్ (23), జేకబ్ బేతెల్ క్రీజ్‌లో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలవాలంటే 48 బంతుల్లో 83 పరుగులు చేయాలి. 67 పరుగుల వద్ద ఇంగ్లండ్ మూడో వికెట్ కోల్పోయింది. రవి బిష్ణోయ్ బౌలింగ్‌లో హర్షిత్ రాణాకు క్యాచ్ ఇచ్చి జోస్ బట్లర్ (2) ఔటయ్యాడు. చివరి ఓవర్‌ను జేమీ ఓవర్టన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. భారత ఆటగాళ్లలో సంజూ శాంసన్ (1), తిలక్ వర్మ (0), సూర్యకుమార్ యాదవ్ (0) దారుణంగా విఫలమయ్యారు.

# ప్రపంచకప్ ఫైనల్లో భారత్..

ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం

ఐసీసీ మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్-2025 టోర్నమెంట్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ జోరు కొనసాగుతోంది. లీగ్ దశ, సూపర్ సిక్స్ దశల్లో సత్తా చాటుతూ జైత్రయాత్రను కొనసాగించిన మన అమ్మాయిలు.. సెమీ ఫైనల్లోనూ అదరగొట్టారు. ఫలితంగా వరుసగా రెండోసారి భారత్ ఈ ఐసీసీ టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టింది. కౌలలంపూర్‌లోని బేయూమస్ ఓవల్ స్టేడియంలో భారత్-ఇంగ్లండ్ మధ్య వరల్డ్‌కప్-2025 రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో టాస్ గెలిచిన ఇంగ్లండ్ అండర్-19 మహిళల జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత ఇరవై ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. ఓపెనర్ డేవీనా పెరిన్ 45 పరుగులతో సత్తా చాటగా.. మరో ఓపెనింగ్ బ్యాటర్ జెమీమా స్పెన్స్ మాత్రం తొమ్మిది పరుగులకే పరిమితమైంది. ఇక కెప్టెన్ అబీ నార్‌గ్రోవ్ 30 పరుగులతో రాణించగా.. లోయర్ ఆర్డర్‌లో అమూ సురేన్‌కుమార్ 14 పరుగులతో అజేయంగా నిలిచింది. మిగతా వాళ్లలో ట్రూడీ జాన్సన్ డకౌట్ కాగా.. చార్లెట్ స్టబ్స్ (4), కేటీ జోన్స్ (0), ప్రిషా తానావాలా(2), చార్లెట్ లాంబర్ట్(0) కూడా పూర్తిగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో పరుణిక సిసోడియా, వైష్ణవి శర్మ మూడేసి వికెట్లతో చెలరేగగా.. ఆయుశీ శుక్లా రెండు వికెట్లు పడగొట్టింది. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు కేవలం ఒక్క వికెట్ నష్టపోయి కమలిని హాఫ్ సెంచరీ.. త్రిష ధనాధన్ ఓపెనర్ జి. కమలిని అర్ధ శతకం(50 బంతుల్లో 56 రన్స్, నాటౌట్)తో మెరవగా.. టోర్నీ ఆరంభం నుంచే అదరగొడుతున్న గొంగడి త్రిష 29 బంతుల్లో 35 పరుగులతో రాణించింది. ఇక తెలుగమ్మాయి త్రిషను ఇంగ్లండ్ బౌలర్ ఫోబే బ్రెట్ అవుట్ చేయగా.. కమలినికి తోడుగా వన్‌డౌన్లో ఆడిన సనికా చాల్కె 11 పరుగులతో అజేయంగా నిలిచింది. 15వ ఓవర్లో కమలిని ఫోర్ బాదడంతో భారత్ విజయం ఖరారైంది. పరుణికకుప్లేయర్ ఆఫ్ దిమ్యాచ్ అవార్డు దక్కింది. ఇక తొలి సెమీస్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా.. ఆసీస్‌ను చిత్తు చేసి తొలి ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. ఆదివారం భారత్- సౌతాఫ్రికా మధ్య ఫైనల్ జరుగుతుంది.

ఐసీసీ మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్-2025- రెండో సెమీ ఫైనల్ భారత్ వర్సెస్ ఇంగ్లండ్- స్కోర్లు ఇంగ్లండ్- 113/8 (20) భారత్- 117/1 (15)
ఫలితం- ఇంగ్లండ్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచి ఫైనల్లో భారత్.





# హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...

## ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్ బరిలో భారత్

ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు భువనేశ్వర్‌లో మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) పురుషుల ప్రొ లీగ్‌లో పాల్గొనే భారత ప్రాబబుల్స్‌ను ప్రకటించారు. ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోనే భారత బృందం తొలి అంచె పోటీల్లో బరిలోకి దిగనుంది. హాకీ ఇండియా లీగ్, జూనియర్ టోర్నీలలో ఆయా ఆటగాళ్లు కనబరిచిన ప్రదర్శన ఆధారంగా మొత్తం 32 మందిని ఈ టోర్నీ కోసం ఎంపిక చేశారు.

ఫిబ్రవరి 15 నుంచి 25వ తేదీ వరకు జరిగే మ్యాచ్‌ల్లో స్పెయిన్, జర్మనీ, ఐర్లాండ్, ఇంగ్లండ్ జట్లతో భారత జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. 2023%-%2024 ప్రొ లీగ్ సీజన్‌లో భారత జట్టు ఏడో స్థానంలో నిలిచింది.

భారత హాకీ ప్రాబబుల్స్: కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కెరా, ప్రిన్స్‌దీప్ సింగ్ (గోల్‌కీపర్లు).

డిఫెండర్లు: హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, సుమిత్, సంజయ్, జుగ్‌రాజ్ సింగ్, నీలం సంజీప్ జెస్, వరుణ్ కుమార్, యశ్‌దీప్ సివాచ్.

మిడ్‌ఫీల్డర్లు: రాజ్‌కుమార్ పాల్, షంషేర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, నీలకంఠ శర్మ, రబిచంద్ర సింగ్, రాజిందర్ సింగ్.

ఫార్వర్డ్స్: అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, మన్‌దీప్ సింగ్, గుర్జంత్ సింగ్, అంగద్‌బీర్ సింగ్, బాబా సింగ్ ధామి, శిలానంద్ లాక్రా, దిల్‌ప్రీత్ సింగ్, అరిజిత్ సింగ్ హుండల్, ఉత్తమ్ సింగ్, అర్ష్ దీప్ సింగ్.